సాక్షి కరీంనగర్

I



ఇటు ఎండా.. అటు ఠండా

ఎండ తారెత్తిస్తోంది. జిల్లాలో గరిష్ట ఉష్ణోగ్రతలు 45డిగ్రీలు దాటుతున్నాయి. ఉదయం 10 దాటితే బయటికి వెళ్లలేని పరిస్థితి. 11 గంటలకే రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఎండ తీవ్రతను భరించలేక ఫ్యాన్లు, కూలర్లు, ఏసీల మధ్య సేద తీరుతున్నారు. మరికొందరు ఈత కొలనులో గడుపుతున్నారు. ఎండల నుంచి ఉపశమనం పొందేలా నగరంలో పలువురు దాతలు ప్రజలకు మజ్జిగ పంపిణీ చేస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్



శుక్రవారం । 3 । మే । 2024

న్యూస్‌రీల్

ఆరడుగుల జాగా కోసం ఇబ్బంది పడుతున్నాం

- స్థలం కేటాయించి శ్మశానవాటిక తరలించాలని డిమాండ్



తిమ్మాపూర్: కరీంనగర్ కార్పొరేషన్ 8వ డివిజన్ పరిధిలోని అల్గునూర్ సమీపంలో మానేరు రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులో భాగంగా అల్గునూర్‌లోని ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన శ్మశాన వాటిక పూర్తిగా కనుమరుగవుతోంది. దీంతో గ్రామస్తులు ఆందోళన చేశారు. శ్మశాన వాటిక కోసం 1976లో 496 సర్వే నంబర్‌లో నాలుగు ఎకరాలు అప్పటి ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. తమ పూర్వీకులకు సంబంధించిన సమాధులు ఇక్కడే ఉన్నాయన్నారు. వాటిని తొలగించడం సరికాదని పేర్కొన్నారు. అభివృద్ధిలో భాగంగా తరలించాల్సి వస్తే ప్రత్యామ్నాయ స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు.

హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్



కరీంనగర్‌టౌన్: జిల్లా ప్రధాన ఆస్పత్రిలో గురువారం హజ్ యాత్రికులకు వాక్సినేషన్ చేశారు. ఓరల్ పోలియో, మెన్‌ఇంజైటిస్, సైమస్ ఇమ్మినో డెఫిషియెన్సీ వైరస్ వ్యాక్సిన్లు ఇచ్చారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ వీరారెడ్డి, డీఎంహెచ్‌వో సుజాత, ఆర్‌ఎంవో నవీన, డీఐవో సాజిదా హతహరి, డిప్యూటీ డీఎంహెచ్‌వో జువేరియా తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్లమెంట్ కో- ఇన్‌చార్జీల నియామకం

కరీంనగర్ కార్పొరేషన్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ కో ఇన్‌చార్జీలను నియమిస్తూ పీసీసీ తెలంగాణ ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షి గురువారం ఆదేశాలు జారీ చేసినట్లు పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. కో ఇన్‌చార్జీలుగా మాజీ ఎమ్మెల్యేలు ఎ.ప్రవీణ్‌రెడ్డి, కటకం మృత్యుంజయం, కోడూరి సత్యనారాయణ గౌడ్, ఆరెపల్లి మోహన్, మాజీ ఎమ్మెల్సీ టి.సంతోష్‌కుమార్, కొండూరి గాంధీరావు, నాగుల సత్యనారాయణగౌడ్, ఆకారపు భాస్కర్‌రెడ్డి, కనిమెని చక్రధర్‌రెడ్డిలను నియమించారు. పార్లమెంట్ పార్టీ ఇన్‌చార్జిగా మంత్రి పొన్నం ప్రభాకర్ గతంలోనే నియమితులయ్యారు.

పత్తి ధర రూ.7,400

జమ్మికుంట: జమ్మికుంటలో క్వింటాల్ పత్తి గరిష్ఠంగా రూ.7,400 పలికింది. గురువారం మార్కెట్‌కు 324 క్వింటాళ్ల పత్తిని రైతులు తెచ్చారు. మోడల్ ధర రూ.7,300, కనిష్ట ధర రూ.7,000 పలికింది. గన్నీ సంచుల్లో ఐదుగురు రైతులు ఆరు క్వింటాళ్ల పత్తిని తెచ్చారు. క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.6,500, మోడల్ ధర రూ.6,000, కనిష్ట ధర రూ.5,200కు ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేశారు. క్రయవిక్రయాలను కార్యదర్శి గుగులోతు రెడ్డి నాయక్ పర్యవేక్షించారు.

పవర్ కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: కరీంనగర్‌లో చేపట్టిన విద్యుత్ పనుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు 11కేవీ మెహర్‌నగర్ ఫీడర్‌లో విద్యు త్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఏడీఈ సాయినేని నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

గీత దాటితే.. వేటే

- ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు
- నేతల ప్రసంగాలు, సోషల్ మీడియాలో పోస్టులపై ఈసీ నజర్
- సిరిసిల్లలో మాజీ సీఎం కేసీఆర్ పరుష పదజాలం వాడినట్లు గుర్తింపు
- ఆయన ప్రచారంపై 48గంటల నిషేధం
- వీడియో పోస్టుకు ఎమ్మెల్యే కౌశిక్‌పై కేసు
- బీఆర్‌ఎస్ అభ్యర్థి అఫిడవిట్‌లో తప్పులున్నాయని బీజేపీ ఫిర్యాదు



సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. సవాళ్లు–ప్రతిసవాళ్లు, విమర్శలు–ప్రతివిమర్శలతో రాజకీయ సభలు, సమావేశాలను హోరెత్తిస్తున్నారు. ఈ క్రమంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌కు విరుద్ధంగా ఉన్న వ్యాఖ్యలు, అఫిడవిట్లలో తప్పులపై ఎన్నికల సంఘానికి, పోలీసులకు ఫిర్యాదులు వెళ్తున్నాయి. అందులో గీత దాటినట్లు తేలితే.. బాధ్యులపై వెంటనే వేటు పడుతోంది. ఇందుకు చిన్న నాయకుడు, పెద్ద నాయకుడు అన్న తేడా లేదు. సున్నితమైన విషయాలను షేర్ చేసే ముందు ఒకటికి పదిసార్లు ఆలోచించుకోవాలి. లేకపోతే కేసుల రూపంలో పర్యవసానాలు తప్పేలా లేవు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షాపై పోస్టు నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డికి ఢిల్లీ పోలీసులు నోటీసులు ఇవ్వగా.. మాజీ సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై 48 గంటలపాటు ప్రచారంలో పాల్గొనకుండా ఈసీ వేటు వేసిన విషయం విదితమే.

మాజీ సీఎం ప్రచారంపై నిషేధం..

సిరిసిల్లలో గత నెల 5న నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాజీ సీఎం కేసీఆర్ కాంగ్రెస్ నాయకులను విమర్శిస్తూ కొంత పరుష పదజాలం ఉపయోగించారు. దీనిపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈసీకి ఫిర్యాదులు వెళ్లడం, అధికారులు నివేదిక సమర్పించడం చకచకా జరిగిపోయాయి. దీంతో ఎన్నికల సంఘం 48 గంటలపాటు ఆయన ప్రచారంలో పాల్గొనకుండా నిషేధం విధించింది.

బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎక్కువ భూమి చూపారని..

బీఆర్‌ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ సమర్పించిన అఫిడవిట్‌లో తప్పులున్నాయని బీజేపీ నాయకులు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఆయన సొంతూరు వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని ఏనుగల్లులో తండ్రి మురళీధర్‌రావు పేరిట 45.16 ఎకరాల భూమి ఉందన్నారు. అందులో వినోద్‌కుమార్ వాటాగా సర్వే నంబర్ 174, 175/ఏ, 251/బీ, 280/ఏ, 306, 307, 279/సీ, 274, 275/ఏ, 272/బీ, 273/ఏ, 282/బీ, 286/ఏలో 11.06 ఎకరాల డ్రై ల్యాండ్, 4.14 ఎకరాల వెట్ ల్యాండ్ ఉన్నట్లు అఫిడవిట్‌లో ప్రకటించారని పేర్కొన్నారు. కానీ, 251/బీ సర్వే నంబర్‌లో ఆయన కుటుంబానికి భూమి లేదని ఫిర్యాదులో తెలిపారు.

- అయితే, వినోద్‌కుమార్ తండ్రి మురళీధర్‌రావుకు ఏనుగల్లు గ్రామంలో 175/4 సర్వే నంబర్‌లో 25 గుంటలు, 175/ఏ/4/1లో మరో 25 గుంటలు మొత్తం 1.10 ఎకరాల అసైన్డ్ ల్యాండ్ చూపిస్తోంది.
- వినోద్‌కుమార్ తన భార్య మాధవి పేరిట రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం నర్సింగాపూర్ గ్రామంలో 2020 జూలైలో 577 సర్వే నంబర్‌లో 19.02 ఎకరాలు, అదే ఏడాది నవంబర్‌లో 582 సర్వే నంబర్‌లో 13 గుంటలు, 579 సర్వే నంబర్‌లో 13 గుంటల భూమి 19.28 ఎకరాల వ్యవసాయ భూమి కొనుగోలు చేసినట్లు చూపారు. కానీ, ధరణి పోర్టల్‌లో ఆమె పేరిట 19.13 ఎకరాలు మాత్రమే నమోదైంది. ఈ లెక్కన 15 గుంటల భూమి అఫిడవిట్‌లో ఎక్కువగా చూపారని బీజేపీ కరీంనగర్ జిల్లా నాయకుడు బాస సత్యనారాయణ రిటర్నింగ్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేశారు.

వీడియో అప్‌లోడ్ చేసిన హుజూరాబాద్ ఎమ్మెల్యే

సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీల అమలులో విఫలమయ్యారని, వాటిపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలంటూ హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఓ వీడియోను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేశారు. దీనిపై పలువురు కాంగ్రెస్ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ జమ్మికుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదైంది.

ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిగేలా చర్యలు



వీసీలో పాల్గొన్న ఎన్నికల అధికారి పమేలా సత్పతి, సీపీ అభిషేక్ మహంతి, ఇతర అధికారులు

- ప్రలోభాల నియంత్రణకు గట్టి నిఘా
- పోలింగ్‌కు ముందు 72 గంటలు హై అలర్ట్
- ఓటింగ్ శాతం పెరిగేలా కసరత్తు చేయండి
- వీసీలో ఢిల్లీ సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితేష్ వ్యాస్

కరీంనగర్ అర్బన్: పార్లమెంట్ ఎన్నికలు నిష్పక్షపాతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితేష్‌వ్యాస్ ఆదేశించారు. ఓటర్లను ప్రలోభ పెట్టకుండా గట్టి నిఘా ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. గురువారం ఢిల్లీలోని ఈసీఐ కార్యాలయం నుంచి ఎన్నికల ఏర్పాట్లతో పాటు పలు అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేశారు. పోలింగ్‌కు 72గంటలపాటు అధికారులంతా హైఅలర్ట్‌గా ఉండాలని సూచించారు. కరీంనగర్ పార్లమెంటు పరిధిలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టామని కలెక్టర్ పమేలా సత్పతి వివరించారు. దాదాపు రూ.8 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నామని, దాదాపు కోటిన్నర మద్యాన్ని పట్టుకున్నామని వివరించారు. 28 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని, ఈ మేరకు రెండేసి బ్యాలెట్ యూనిట్లు అవసరం పడుతున్నాయని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎన్నికల సాధారణ పరిశీలకుడు, ఐఏఎస్ అధికారి అమిత్ కటారియా స్పష్టం చేశారు. పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని పోలీస్ పరిశీలకుడు మనీష్ చౌదరీ తెలిపారు. కోడ్ ఉల్లంఘన జరగకుండా కఠినంగా వ్యవహరిస్తున్నామని సీపీ అభిషేక్ మహంతి స్పష్టం చేశారు. పార్లమెంట్ పరిధిలో కోడ్ ఉల్లంఘనపై నాలుగు కేసులు పెట్టామని పేర్కొన్నారు. పార్లమెంటు అభ్యర్థుల ఎన్నికల వ్యయంపై ఎప్పటికప్పుడు ప్రత్యేక దృష్టి పెడుతున్నామని ఎన్నికల వ్యయ పరిశీలకులు అశ్వినీ కుమార్ పాండే పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, ఎన్నికల వ్యయ పరిశీలన నోడల్ అధికారి రామానుజచార్య, తదితరులు పాల్గొన్నారు.

కస్టడీకి భూకబ్జా నిందితులు

కరీంనగర్‌క్రైం: నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి, ఇంటి స్థలాన్ని కాజేయడానికి యత్నించిన కేసులో నగరంలోని బ్యాంకుకాలనీకి చెందిన దొమ్మటి యుగేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 12మందిపై కొత్తపల్లి పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు కాగా మహమ్మద్ ఫిరోజ్‌ఖాన్, కాంపెల్లి రామాంజనేయులు, జంకె శ్రీకాంత్, కొత్తపల్లి రాజును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆదర్శనగర్‌కు చెందిన మొహమ్మద్ లతీఫ్ ఇచ్చిన ఫిర్యాదుతో బారాజు రత్నాకర్‌రెడ్డి, చందా శంకర్‌రావు, బకిట్ సాయి, పిట్టల మధు, షాహిద్‌ఖాన్‌ను అరెస్ట్ చేసి వారిళ్లలో కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.

భూ కబ్జా యత్నంలో ఇద్దరిపై కేసు

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్ శివారులో తప్పుడు పత్రాలతో భూకబ్జాకు ప్రయత్నించిన ముద్దసాని కొమురెల్లి, లంక శేఖర్‌పై చొప్పదండి పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ ఉపేంద్రచారి కథనం ప్రకారం.. రుక్మాపూర్ లో సర్వే నంబర్ 15/ఏలో 35గుంటల భూమిని ఇదే గ్రామానికి చెందిన ముద్దసాని రంగయ్య, వంగ నరేశ్, చొప్పదండికి చెందిన గుర్రం రాజేందర్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి కలిసి 2017లో రుక్మాపూర్‌కు చెందిన లంక రాజయ్య కుమారుల ద్వారా కొనుగోలు చేశారు. ఈ భూమిపై ముద్దసాని రాజయ్య కోర్టులో కేసువేయగా అప్పటికే కొనుగోలు చేసినవారు లోక్ అదాలత్‌లో రాజీపడ్డారు. ఆపై న్యాయపరమైన చిక్కులు రాకుండా అమ్ముకొనేందుకు పేపర్ ప్రకటన ఇచ్చారు. అదిచూసిన ముద్దసాని కొమురెల్లి, లంక శేఖర్ దురుద్దేశపూర్వకంగా సాదాబైనామా తయారు చేసి, వివాదాస్పదం చేశారు. ఎస్సీ, ఎస్టీ కేసులు పెడతామని నలుగురిని బెదిరించారు. దీంతో ముద్దసాని రంగయ్య, అతని భాగస్వాములు పోలీసులను ఆశ్రయించారు. విచారణ జరిపి గురువారం ముద్దసాని కొమురెల్లిని అరెస్ట్ చేశారు. లంక శేఖర్ ఇతర కేసుల్లో జైలులోనే ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లలో టాప్

- రాష్ట్రంలోనే మొదటిస్థానంలో కరీంనగర్ జిల్లా
- గతంలో ఇదే సమయానికి 15వేల మెట్రిక్ టన్నులు
- ప్రస్తుతం లక్ష మెట్రిక్ టన్నులకు పైగా కొనుగోలు
- ఫలించిన కలెక్టర్ పమేలా సత్పతి కృషి

కరీంనగర్ అర్బన్: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు శరవేగంగా సాగుతున్నాయి. కలెక్టర్ పమేలా సత్పతి ప్రత్యేక దృష్టిసారించగా ప్రత్యేక అధికారులను నియమించిన విషయం తెలిసిందే. దీంతో జిల్లా రాష్ట్రంలోనే మొదటి వరుసలో నిలుస్తోంది. గతంలో ఇదే సమయానికి 15,414మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా ఇప్పుడు 1.02లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయడం విశేషం. రూ.181కోట్ల విలువ గల ధాన్యం వివరాలను అప్‌లోడ్ చేయగా ఇప్పటికే రూ.121కోట్లు రైతుల ఖాతాకు చేరాయి. జిల్లాలోని కరీంనగర్, హుజూరాబాద్, మానకొండూరు, చొప్పదండి వ్యవసాయ డివిజన్లకు గానూ పీఏసీఎస్ 213 కేంద్రాల్లో కొనుగోలు చేస్తుండగా ఐకేపీ 50, హాకా 4, డీసీఎంఎస్ 43 కేంద్రాల్లో కొనుగోళ్లు జరుగుతున్నాయి.

1,02,201 మెట్రిక్ టన్నుల ధాన్యం.. రూ.121కోట్లు చెల్లింపు

జిల్లాలో మొత్తం 341 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా సాగు విస్తీర్ణం, దిగుబడి క్రమంలో కేంద్రాల సంఖ్య తగ్గింది. తొలుత ఐకేపీ 50, పీఏసీఎస్ 238, డీసీఎంఎస్ 47, హాకా ఆరు కేంద్రాల్లో కొనుగోలు చేయాలని భావించినప్పటికీ దిగుబడుల క్రమంలో ఐకేపీ 50, పీఏసీఎస్ 213, డీసీఎంఎస్ 43, హాకా 4 కేంద్రాల్లో కొనుగోళ్లను ముమ్మరం చేసింది. ఇప్పటివరకు 16,189 మంది రైతులు కేంద్రాల్లో విక్రయించగా 1,02,201 మెట్రిక్ టన్నుల ధాన్యం విక్రయించారన్నది సుస్పష్టం. 1,01,601.880 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు తరలించగా మరో 599.980మె.టలను తరలించాల్సి ఉంది. ఇదిలాఉంటే రూ.225కోట్ల విలువ గల ధాన్యం కొనుగోలు చేయగా రూ.158కోట్లకు ట్రక్‌షీట్ జనరేట్ కాగా మిల్లర్లు అక్నలజ్‌మెంట్ రూ.143.74కోట్లు పూర్తి చేసింది. ఈ నేపథ్యంలో రూ.121.77కోట్లు రైతుల ఖాతాకు చేరాయి.

ప్రత్యేక అధికారులతో పర్యవేక్షణ

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ముమ్మరం చేసేందుకు కలెక్టర్ ప్రత్యేక అధికారులను నియమించిన విషయం తెలిసిందే. డీఆర్డీవో వి.శ్రీధర్‌కు గంగాధర, రామడుగు మండలాలు, జిల్లా పౌరసరఫరాల అధికారి సురేశ్‌రెడ్డికి హుజూరాబాద్, శంకరపట్నం, పౌరసరఫరాల సంస్థ డీఎం ఎం.రజనీకాంత్‌కు తిమ్మాపూర్, మానకొండూరు, జిల్లా మార్కెటింగ్ అధికారి యం.పద్మావతికి కొత్తపల్లి, కరీంనగర్ రూరల్, చొప్పదండి, జిల్లా వ్యవసాయ అధికారి బి.శ్రీనివాస్‌కు గన్నేరువరం, చిగురుమామిడి, ఎస్.రామానుజచార్యకు సైదాపూర్, వీణవంక, డీసీఎంఎస్ ఆర్.వెంకటేశ్వర్‌రావును ఇల్లందకుంట, జమ్మికుంట మండలాలకు ప్రత్యేక అధికారులుగా వ్యవహరిస్తున్నారు.

ఇతర జిల్లాల నుంచి ధాన్యం

ధాన్యం దిగుబడులు ముంచెత్తగా రైస్‌మిల్లులు కిక్కిరిశాయి. మూతబడిన మిల్లులు కూడా తెరచుకోవడం మిల్లుల ప్రాధాన్యతను చాటుతోంది. రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాలో మిల్లులు ధాన్యంతో నిండిపోవడంతో కరీంనగర్ జిల్లాలోని మిల్లులకు కేటాయించారు. ఇతర జిల్లాల ధాన్యం కరీంనగర్ మిల్లులకు తరలిస్తున్నారు. నిర్మల్, ఖమ్మం, మంచిర్యాల, వరంగల్ అర్బన్ జిల్లాల నుంచి ధాన్యం రానున్నట్లు సమాచారం.



ధాన్యం కొనుగోళ్లు

జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల వివరాలు

కొనుగోలు కేంద్రాలు: 310
కొనుగోలు చేసిన ధాన్యం: 1,02,201.860(మె.ట)
మొత్తం రైతులు: 16,189
ధాన్యం విలువ: రూ.225.15కోట్లు
అప్‌లోడ్ అయిన ధాన్యం విలువ: రూ.181.95కోట్లు
మిల్లర్లకు చేరిన ధాన్యం విలువ: రూ.181.95కోట్లు
రైతులకు చెల్లించిన నగదు: రూ.121.77కోట్లు
చెల్లించాల్సిన నగదు: రూ.21.97కోట్లు

మనమే నంబర్ వన్



మంచిర్యాల చౌరస్తాలో కార్నర్ మీటింగ్‌కు హాజరైన జనం, మాట్లాడుతున్న సంజయ్(ఇన్‌సెట్‌లో)

- ఈవీఎంలో ఒకటో నంబరు బటన్ నొక్కి ఓటేయండి
- కార్యకర్తలకే తెలియని కాంగ్రెస్ అభ్యర్థికి ఓటేస్తే లాభమేంటి?
- ఎన్నికలప్పుడు తప్ప ఎన్నడూ కన్పించని బీఆర్‌ఎస్ అభ్యర్థి
- స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్

కరీంనగర్‌టౌన్: 'ఈ ఎన్నికల్లో మనమే నంబర్ వన్. ఈవీఎంలోనూ 1వ నంబర్ మనదే. వచ్చే నెల 13న జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఈవీఎంలోని 1వ నంబర్ పక్కనున్న పువ్వు గుర్తుపై బటన్ నొక్కి ఓటేసి బంపర్ మెజారిటీతో గెలిపించండి' అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం రాత్రి కరీంనగర్‌లోని మంచిర్యాల చౌరస్తాలో జరిగిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్నారు. సంజయ్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో పోటీ చేస్తున్న బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థుల చరిత్రను బేరీజు వేసి మీకు ఎవరు మేలు చేస్తారో ఆలోచించి తీర్పు ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ అభ్యర్థి రాజేందర్‌రావు ఎవరో ఆ పార్టీ కార్యకర్తలకే తెలియదన్నారు. నాన్ లోకల్ వినోద్‌రావు ఎన్నికలప్పుడు తప్ప ఎన్నడూ ప్రజలకు కన్పించరన్నారు. ఈ ఇద్దరు రావులకు పొరపాటున ఓటేస్తే మీకు ఏమీ రావు అన్నారు. దేశమంతా నరేంద్రమోదీ గాలి వీస్తుంటే అక్కసుతో సాక్షాత్తూ ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తే రిజర్వేషన్లపై పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తూ ప్రజలను గందరగోళానికి గురి చేయడం దుర్మార్గమన్నారు. శ్రీరాముడి అక్షింతలను కూడా కించపర్చేస్థాయికి కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతలు దిగజారారన్నారు. అధికారంలోకి వస్తే వందరోజుల్లోనే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చి మాటమార్చారని, ప్రశ్నించినందుకు తనను ఓడించడానికి కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు కుమ్మక్కయ్యాయని ఆరోపించారు.

హామీలిచ్చాం.. అమలు చేస్తున్నాం



జమ్మికుంట కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

- బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- జమ్మికుంట మండలం నాగపేటలో కార్నర్ మీటింగ్

జమ్మికుంట/కరీంనగర్ కార్పొరేషన్: అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీలు అమలు చేస్తున్నామని బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. గురువారం జమ్మికుంట మండలం నాగంపేటలో నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌కు ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుతో కలిసి హాజరై మాట్లాడారు. బండి సంజయ్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేయకుండా, అక్షింతలు పంచి, రాముడి ఫొటో పెట్టి ఓటు అడుగుతున్నారని విమర్శించారు. తాను ఎంపీగా ఉన్న సమయంలో జమ్మికుంటకు మోడల్‌స్కూల్, మోడల్ రైల్వేస్టేషన్, ఫైర్‌స్టేషన్, తిరుపతికి రైలు, ఆర్వోబీతో పాటు అనేక అభివృద్ధి పనులు చేశానని గుర్తు చేశారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో నలుగురం ఎమ్మెల్యేలం ఉన్నామని, తమ పార్టీ అభ్యర్థిని ఎంపీగా గెలిపిస్తే ప్రతీ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆరు గ్యారంటీలతో పాటు ఆగస్టు 15లోపు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. అనంతరం మాజీ సర్పంచ్ స్వాతి– కృష్ణారెడ్డితోపాటు పలువురు కాంగ్రెస్‌లో చేరారు. గురువారం రాత్రి కరీంనగర్‌లోని కోతిరాంపూర్, నాఖా చౌరస్తాలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో రాజేందర్‌రావుతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. బీజేపీకి 400సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మార్చే ప్రమాదం ఉందన్నారు. స్థానిక ఎమ్మెల్యే నగరంలో ఒక్క డబుల్ బెడ్ రూం ఇల్లు కట్టి ఇచ్చినట్టు నిరూపించినా పోటీ నుంచి తమ అభ్యర్థి తప్పుకుంటారని స్పష్టం చేశఋరు. బీఆర్‌ఎస్‌కు ఓటువేస్తే వృథా అని, వినోద్ ఓడిపోగానే వరంగల్‌కు వెళ్తారని తెలిపారు. బండి సంజయ్ మాటలు తప్ప అభివృద్ధి చేయలేదని ధ్వజమెత్తారు.

అభివృద్ధి చేస్తా.. ఆశీర్వదించండి



టవర్‌సర్కిల్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్

- కాంగ్రెస్, బీజేపీతో ఒరిగేదేమీ లేదు
- బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్

కరీంనగర్: అభివృద్ధి కోసం బీఆర్‌ఎస్ పార్టీకే ఓట్లు వేసి ఆశీర్వదించాలని, ఎంపీగా మరోసారి గెలిపిస్తే వేల కోట్లు నిధులు, ప్రత్యేక ప్రాజెక్టులు, పరిశ్రమలు సాధిస్తానని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. గురువారం ఉదయం ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌తో మార్నింగ్‌వాక్‌లో పాల్గొని ఓట్లను అభ్యర్థించారు. రాత్రి టవర్‌సర్కిల్‌లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బోయినపల్లి వినోద్‌కుమార్ మాట్లాడుతూ 60ఏళ్లుగా కరీంనగర్ అభివృద్ధిని ఎవరూ పట్టించుకోలేదని, కాంగ్రెస్, బీజేపీలు కుటిల రాజకీయాలు చేస్తూ ప్రజా సంక్షేమాన్ని విస్మరించాయని అన్నారు. బీజేపీ ఎంపీ బండి సంజయ్ ఐదేళ్లుగా నయాపైసా తేలేదన్నారు. కాంగ్రెస్, బీజేపీలు ఐదు దశాబ్దాలుగా పరిపాలించి ప్రజలను వంచించాయని గుర్తు చేశారు. 2014–2019లో తాను ప్రతిపక్ష ఎంపీగా ఉన్నప్పటికీ కరీంనగర్ అభివృద్ధికి నిధులు తెచ్చానని గుర్తు చేశారు. బండి సంజయ్ ఐదేళ్లలో ఒక్క మున్సిపల్ సమావేశానికి కానీ, జిల్లా పరిషత్ సమావేశానికి కానీ హాజరు కాలేదని విమర్శించారు. ప్రజా సమస్యలు పట్టించుకోని సంజయ్‌కి ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. బీఆర్‌ఎస్‌తో గెలుపుతోనే అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని, తనను మరోసారి ఎంపీగా పంపిస్తే తెలంగాణ అభివృద్ధికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని స్పష్టం చేశారు. మేయర్ వై.సునీల్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ.రామకృష్ణారావు, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, కార్పొరేటర్లు సోనూసింగ్, వంగల శ్రీదేవి పవన్ కుమార్, అక్బర్ హుస్సేన్, అనిల్‌గౌడ్ ఉన్నారు.

క్లుప్తంగా

వరికొయ్యలకు నిప్పుతో ప్రమాదం


కాలిపోతున్న మోటార్, పైపులు

కోనరావుపేట(వేములవాడ): వరి కొయ్యలకు నిప్పు పెట్టడంతో మోటార్లు, పైపులు, విద్యుత్ తీగలు కాలిపోయాయి. ధర్మారం శివారులోని పెద్ద చెరువుకట్ట కింద ఓ రైతుపొలంలో ఉన్న కొయ్యకాళ్లకు నిప్పుపెట్టారు. మంటలు పెరిగి పెద్దగా మారడంతో చుట్టుపక్కల ఉన్న రైతులు మల్లైవేణి బాలకిషన్, తిరుపతి, అమరేందర్, నందం, రాజు, ముత్తయ్య, ఐలయ్యలకు సంబంధించిన మోటార్లు, పైపులు, వైర్లు కాలిపోయాయి. మంటల్లో చిక్కుకున్న పశువులను రైతులు కాపాడుకోగలిగారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.లక్షన్నర మేర ఆస్తినష్టం జరిగినట్లు బాధిత రైతులు పేర్కొన్నారు.

బీ- థర్మల్‌లో నిలిచిన విద్యుత్ ఉత్పత్తి


బీ-థర్మల్ విద్యుత్ కేంద్రం

రామగుండం: పెద్దపల్లి జిల్లా రామగుండం పట్టణంలోని 62.5 మెగావాట్ల సామర్థ్యం గల బీ-థర్మల్ కేంద్రంలో మిల్స్ విభాగంలో తలెత్తిన సాంకేతికలోపంతో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. గత నెల బాయిలర్‌లో తలెత్తిన సాంకేతిక లోపంతో ఏప్రిల్ 23న ఉత్పత్తిని పునరుద్ధరించారు. మళ్లీ ఆరు రోజుల తర్వాత 29న మిల్స్‌లో తలెత్తిన సాంకేతిక లోపంతో ఉత్పత్తి నిలిచిపోగా ఇప్పటికీ ఇంజినీర్లు, ఉద్యోగులు పునరుద్ధరణ పనుల్లో నిమగ్నమయ్యారు. కాగా విద్యుత్ కేంద్రంలో తరచూ సాంకేతిక సమస్యలు ఎదురవుతున్న నేపథ్యంలో తిరిగి పునరుద్ధరించేందుకు లక్షలాది రూపాయల నిధులు వెచ్చిస్తున్నా విద్యుత్ ఉత్పత్తి కాకపోవడంతో బీ-థర్మల్ కేంద్రం మనుగడపై ప్రభుత్వం పునరాలోచించాలని ప్రజలు కోరుతున్నారు.

రూ.3.77లక్షలు పట్టివేత

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని జంబిగద్దె వద్ద పట్టణ ఎస్సై మన్మథరావు ఆధ్వర్యంలో గురువారం మధ్యాహ్నం వాహనాల తనిఖీ చేపట్టగా ధరూర్‌కు చెందిన పిన్నం లచ్చయ్య ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.2లక్షల నగదును పట్టుకుని సీజ్ చేశారు. అలాగే తహసీల్ చౌరస్తాలో పట్టణ ఎస్సై నరేశ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టగా సారంగాపూర్ మండలం అర్పపల్లికి చెందిన కుడుకల రాజయ్య ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.1.77 లక్షల నగదును సీజ్ చేసి గ్రీవెన్‌సెల్‌కు పంపించారు.

మళ్లీ దొంగనోట్ల దందా..?

- గుట్టుగా నడుస్తున్న నకిలీ రాకెట్
- నిత్యం నగదు లావాదేవీల్లో చలామణి
- ఇటీవల ఓ బ్యాంకులో బయటపడిన రూ.500 నకిలీ నోటు



నకిలీ ఐదు వందల నోటు

మంథని: 'మంథని మున్సిపాలిటీ పరిధిలోని విశ్వబ్రాహ్మణ వీధికి చెందిన ఓ వ్యక్తి స్థానికంగా ఉన్న ఓ బ్యాంకులో చెక్కు డిపాజిట్ చేసి నగదు డ్రా చేసుకున్నాడు. తర్వాత అంతే మొత్తం డబ్బును మరో బ్యాంకులో డిపాజిట్ చేసేందుకు వెళ్లాడు. ఆ మొత్తానికి ఓచర్ రాసి క్యాషియర్‌కు ఇచ్చాడు. నగదును కౌంటింగ్ చేసేందుకు యంత్రంలో వేయగా, అందులో ఒక 500 నోటు నకిలీగా తేలింది. దీంతో సదరు వ్యక్తి అవాక్కయ్యాడు. ఇచ్చిన మొత్తంలో రూ.500 తగ్గడంతో అంతే మొత్తానికి ఓచర్ చేతిలో పెట్టాడు. హైరానా పడిన సదరు వ్యక్తి వెంటనే తాను డబ్బులు డ్రా చేసిన బ్యాంకు వెళ్లి తనకు నగదు ఇచ్చిన ఉద్యోగితో వాదనకు దిగాడు. మా బ్యాంకులో అలా జరగదని, నకిలీ నీ వద్దే వచ్చి ఉంటుందని మాకు సంబంధం లేదని ఉద్యోగి దబాయించాడు. దీంతో ఆ వ్యక్తి బ్యాంకు మేనేజర్ దృష్టికి తీసుకెళ్లగా.. బ్యాంకులో అలా జరగదని అతను సైతం కొట్టిపారేశాడు. కానీ బాధితుడు గట్టిగా వాదించి సీసీ ఫుటేజీ చూడాలని పట్టుబట్టారు. తర్వాత నకిలీ నోటు తీసుకొని అసలు నోటును బాధితుడి చేతిలో పెట్టారు'.

మంథని కేంద్రంగా రాకెట్..?

నోట్ల రద్దుకు ముందు మంథని కేంద్రంగా దొంగ నోట్ల దందా పెద్ద ఎత్తున సాగింది. ఓ బ్యాంకు ఉద్యోగి సాయంతో ఇక్కడ నకిలీ నోట్లు తయారు చేసి ఇతర ప్రాంతాలకు చలామణి చేశారు. కానీ పాత నోట్ల రద్దు తర్వాత దందా కనుమరుగైంది. కాగా మంగళవారం మంథనిలోని ఓ బ్యాంకులో రూ.500 నోటు బయటపడడంతో నకిలీ నోట్ల దందా మళ్లీ మొదలైందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే గతంలో నకిలీ నోట్ల రాకెట్ నడిపించిన ముఠా పనా? లేక కొత్త వ్యక్తులు మొదలుపెట్టారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. నకిలీ నోట్ బయట పడడంతో ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

బ్యాంకు ఉద్యోగుల నిర్లక్ష్యమా..?

బ్యాంకులో నగదు లావాదేవీలు చేస్తే నకిలీ నోట్లు రావనే నమ్మకం ఖాతాదారుల్లో ఉంది. ఎందుకంటే బ్యాంకుల్లో సాధారణంగా నగదు మిషన్ ద్వారా లెక్కించడమే కాకుండా నకిలీ, అసలు నోట్లను గుర్తించేందుకు మరో మిషన్ ఉంటుంది. దీంతో ఖాతాదారు బ్యాంకులో డిపాజిట్ చేసిన మొత్తాన్ని లెక్కించడంతో పాటు అసలు, నకిలీ గుర్తించాకే సదరు ఖాతాదారు అకౌంట్‌లో నగదు జమ చేస్తారు. ఇది సాధారణంగా జరిగే పక్రియ. కానీ కొన్ని బ్యాంకుల్లో లావాదేవీలు ఎక్కువ ఉండడం, సరిపడా సిబ్బంది లేక, పని ఒత్తిడి కారణంగా పలు సందర్భాల్లో డిపాజిట్ చేసిన సొమ్మును పరిశీలించకుండానే తిరిగి ఖాతాదారులకు చెల్లింపులు చేస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో నకిలీ నోట్లను గుర్తించడం లేదని తెలుస్తోంది. ఇది గమనించిన కొందరూ నకిలీ నోట్ల దందాకు తెరలేపినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బ్యాంకులో పరిశీలన జరిగితే నకిలీ నోట్లు డిపాజిట్ అయ్యే అవకాశమే లేదు. కానీ, బ్యాంకులోనే నకిలీ నోట్ ప్రత్యక్షం కావడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, బ్యాంకు సిబ్బంది ప్రమేయంతోనే ఈ దందా సాగుతుందా? అనే సందేహాలు సైతం వెల్లువెత్తుతున్నాయి.

రైతులు, కూలీలే టార్గెట్

భవన నిర్మాణ, ఇతర రంగాల్లో పనిచేసే కూలీలు, రైతులే టార్గెట్‌గా నకిలీ నోట్ల దందా సాగుతున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కూలీ పనిచేసే వారికి నగదు లావాదేవీలే అధికంగా ఉంటాయి. నిత్యం వారి అవసరాలతో పాటు వారం వారం డబ్బు తీసుకుంటారు. ఈ క్రమంలో నకిలీ నోట్లు చలామణి జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. స్థానికంగా ఈ దందా గుట్టుగా పెద్ద ఎత్తునే సాగుతున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై పోలీసులు, ఇతర శాఖలు దృష్టి సారిస్తే అసలు విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి.

ఎండకు చేపలు విలవిల

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో చనిపోతున్న చేపలు
- చెరువులు, కుంటల్లో అడుగంటిన జలాలు
- అత్యధిక ఉష్ణోగ్రతలకు ఆవిరి అవుతున్న నీరు


మర్రిపల్లి చెరువులో చనిపోయిన చేపలు

జిల్లాలో చేపల పెంపకం వివరాలు
ప్రాజెక్టులు : మిడ్‌మానేరు, ఎగువ మానేరు
చెరువులు, కుంటలు : 440
వేసిన చేపపిల్లలు : 1.40 కోట్లు
మత్స్యకార్మికులు : 8,400
మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు : 135

బోయినపల్లి(చొప్పదండి): ఎండలు దంచి కొడుతున్నాయి. చెరువులు, కుంటల్లో నీరు వెడెక్కుతోంది. ఎండల ధాటికి చెరువుల్లోని చేపపిల్లలు చనిపోతున్నాయి. ఇటీవల వేములవాడరూరల్ మండలం మర్రిపల్లి, తంగళ్లపల్లి మండలం మండేపల్లి చెరువుల్లో భారీగా చేపలు చనిపోయాయి. వేడిమికి నీటిలో కరిగి ఉన్న ప్రాణవాయువు(ఆక్సిజన్) తగ్గి పోతోంది. 43 నుంచి 45 డిగ్రీల వరకు నమోదవుతున్న ఉష్ణోగ్రతలతో విపరీతమైన ఉష్ణోగ్రతలకు నీళ్లలో ఉన్న చేపలు ప్రాణాలు కోల్పోతున్నాయి.

జిల్లాలో 440 చెరువులు, రెండు ప్రాజెక్టులు

జిల్లాలోని 13 మండలాల్లో 440 చెరువులు, కుంటలు ఉన్నాయి. బోయినపల్లి మండలం మాన్వాడలో మిడ్‌మానేరు ప్రాజెక్టు, గంభీరావుపేట మండలంలో ఎగువమానేరు ప్రాజెక్టులు ఉన్నాయి. సముద్రలింగాపూర్‌లో సింగసముద్రం చెరువు, వేములవాడ, విలాసాగర్ లార్జ్ ట్యాంకులు ఉన్నాయి. గత వర్షాకాలం సీజన్‌లో జిల్లాలోని 440 చెరువుల్లో 1.40 కోట్ల మేర చేపపిల్లలను వదిలినట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి శివప్రసాద్ తెలిపారు. ఇందులో మిడ్‌మానేరు ప్రాజెక్టులో 28 లక్షలు, ఎగువ మానేరు ప్రాజెక్టులో 11 లక్షల చేపపిల్లలు వేశారు.

8 వేల మంది మత్స్యకారులు

జిల్లాలో చేపల పెంపకం ద్వారా 8,400 మంది మత్స్యకార్మికులు ఉపాధి పొందుతున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో 135 మత్స్య పారిశ్రామిక సహకారా సంఘాలు, వేములవాడలో మహిళా మత్స్యపారిశ్రామిక సహకార సంఘం, ఎగువమానేరులో మత్స్య మార్కెటింగ్ సొసైటి ఉంది. మత్స్య కార్మికులు చేపలు పట్టడం ద్వారా జీవనోపాధి పొందుతున్నారు.

గతేడాది 6వేల టన్నుల చేపల దిగుబడి

మిడ్‌మానేరు, ఎగువమానేరు ప్రాజెక్టులు, 440 చెరువుల్లో కలుపుకుని గతేడాది ఆరు వేల టన్నుల మేర చేపల దిగుబడి వచ్చినట్లు అధికారులు తెలిపారు. మిడ్‌మానేరు ప్రాజెక్టు పరిసరాల్లో నిత్యం సుమారు 1 నుంచి 2 టన్నుల మేర చేపల దిగుబడి వస్తున్నట్లు పేర్కొంటున్నారు.

ఎండకు విలవిల

చెరువుల్లో సలసలా కాగుతున్న నీళ్లలో ప్రాణవాయువు కరిగి పోతుంటే అందులోని చేపలు చనిపోయే ప్రమాదం ఉంది. ఈక్రమంలో చేపల వృత్తితో జీవనోపాధి పొందుతున్న పలువురు మత్స్యకారులు కష్టాలకోర్చి చేపలు పడుతున్నారు. మిడ్‌మానేరు పరిసరాల్లో తెప్పె ఆధారంగా విసురుడు వలతో ఎండ తగలకుండా చేపలు పడుతున్నారు. ఎండలతో చేపల దిగుబడి తగ్గుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎండలు విపరీతంగా పెరిగాయి


కొద్ది రోజులుగా ఎండలు విపరీతంగా కొడుతున్నాయి. ఎండకు నీటిలోని చేపలు చనిపోయే ప్రమాదం ఉంది. ఇంత ఎండ ఎప్పుడు చూడ లేదు. చేపలు బతికుంటేనే మాకు ఉపాధి దొరుకుతుంది.
– బొజ్జ వెంకటేశ్, బోయినపల్లి

1.40 కోట్ల చేపపిల్లలు విడుదల


రాజన్న సిరిసిల్ల జిల్లాలో మిడ్ మానేరు, ఎగువ మానేరు ప్రాజెక్టులతోపాటు 440 చెరువులు, కుంటలు ఉన్నాయి. గతేడాది చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లో 1.40 కోట్ల మేర చేపపిల్లలు విడుదల చేశాం. గతేడాది 6వేల టన్నుల దిగుబడి వచ్చింది. ఒకటి, రెండు చోట్లలో ఎండకు చేపలు చనిపోయాయి. మిగతా చోట్ల బాగానే ఉన్నాయి.
– జి.శివప్రసాద్, జిల్లా మత్స్యశాఖ అధికారి, సిరిసిల్ల

వీళ్లకు ముందే ఓట్ల పండగ

- నేటి నుంచే పోస్టల్ బ్యాలెట్, ఇంటి వద్దే ఓటింగ్
- వృద్ధులు, దివ్యాంగులకు అవకాశం

కరీంనగర్ అర్బన్: అవును వీళ్లకు ముందే ఓట్ల పండగ. పార్లమెంట్ ఎన్నికల్లో తొలిసారిగా ఓటు హక్కు వినియోగించుకోనుండగా ఇంటి వద్దే ఓటింగ్ ఇదే తొలిసారి. గత అసెంబ్లీ ఎన్నికల్లో సదరు ప్రక్రియను ప్రారంభించిన ఎన్నికల సంఘం పార్లమెంట్ ఎన్నికల్లోనూ నిర్వహిస్తోంది. ఈ క్రమంలో సార్వత్రిక రణక్షేత్రంలో ఓటింగ్ ప్రక్రియ మరికొద్ది గంటల్లో మొదలవనుంది. పోస్టల్ బ్యాలెట్‌తో పాటు ఇంటి వద్దే ఓటింగ్ ప్రక్రియకు ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి ప్రత్యేక చర్యలు చేపట్టారు. శుక్రవారం నుంచి ఈ నెల 8వరకు ఓటింగ్ ప్రక్రియ జరగనుంది. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు, అధికారులు పోస్టల్ బ్యాలెట్ వేసేలా నగరంలోని సెయింట్ అల్ఫోన్స్ పాఠశాలలో ఏర్పాట్లు చేయగా ఇంటి వద్దే ఓటింగ్ కోసం ప్రత్యేక బృందాలను నియమించారు. ప్రతీ సెకన్ వీడియో చిత్రీకరణ జరగనుండగా అత్యంత పకడ్బందీగా ఓటింగ్ నిర్వహించనున్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో కరీంనగర్, హుజూరాబాద్, హుస్నాబాద్, వేములవాడ, సిరిసిల్ల, మానకొండూరు, చొప్పదండి నియోజకవర్గాలుండగా సదరు ప్రాంతాల్లో ఓటింగ్‌కు ప్రత్యేక చర్యలు చేపట్టారు.


కలెక్టరేట్ చేరిన పోస్టల్ బ్యాలెట్

కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో
మొత్తం వృద్ధఓటర్లు: 13,204
పురుషులు: 5,135, స్త్రీలు: 8,069
మొత్తం దివ్యాంగులు: 41,573
పురుషులు: 23,848, స్త్రీలు: 17,725
ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు: 13,635

ఓటర్ల సంఖ్య క్రమంలో బృందాలు

85ఏళ్ల పైబడినవారు, దివ్యాంగులు, అచేతనుల కోసం ఇంటి వద్దే ఓటింగ్ విధానం చేపట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఓటర్ల సంఖ్యను బట్టి బృందాలను ఏర్పాటు చేశారు. అత్యధికంగా వేములవాడ నియోజకవర్గంలో 16 బృందాలను ఏర్పాటు చేయగా అత్యల్పంగా సిరిసిల్లలో 4 బృందాలు ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో పీవో, ఏపీవో, వీడియో గ్రాఫర్, పోలీస్ ఉండనున్నారు.


పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ జరగనున్న నగరంలోని సెయింట్ ఆల్ఫోన్స్ పాఠశాల

కరీంనగర్, చొప్పదండి నియోజకవర్గాల్లో 6, మానకొండూరు 8, హుజూరాబాద్ 5, హుస్నాబాద్ నియోజకవర్గంలో 6 బృందాలను ఏర్పాటు చేశారు. ఆరు రోజుల పాటు ఓటింగ్ ప్రక్రియ సాగనుండగా ప్రతిరోజు స్ట్రాంగ్ రూం నుంచి ఈవీఎంలతో వెళ్లి మళ్లీ సాయంత్రం స్ట్రాంగ్ రూంలో భద్రపరచడం నిఘా నీడలో జరగనుంది.

పోస్టల్ బ్యాలెట్‌కు సర్వం సిద్ధం

జిల్లాలోని కరీంనగర్, హుజూరాబాద్, మానకొండూరు, చొప్పదండి ప్రాంతాలకు చెందిన ఉద్యోగుల కోసం పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కోసం సర్వం సిద్ధం చేశారు. నగరంలోని సెయింట్ అల్ఫోన్స్ పాఠశాలలో పోస్టల్ ఓటింగ్ జరగనుండగా ప్రత్యేక సిబ్బందిని నియమించారు. నియోజకవర్గాల వారీగా బాక్స్‌లను ఏర్పాటు చేశారు. ఈ నెల 8వ రకు అవకాశమివ్వనుండగా ప్రతిరోజు ఓటింగ్ ముగిసిన అనంతరం కలెక్టరేట్‌లోని స్ట్రాంగ్ రూంకు తరలించనున్నారు.

రాజన్న ఆదాయం రూ.1.52 కోట్లు


హుండీ ఆదాయం లెక్కిస్తున్న ఆలయ అధికారులు, సిబ్బంది, రాజరాజేశ్వర సేవాసమితి సభ్యులు

వేములవాడ: వేములవాడ రాజన్నకు 21 రోజుల్లో హుండీల ద్వారా రూ.1,52,15,575 నగదుతోపాటు బంగారం 218 గ్రాములు, వెండి 11.500 కిలోలు సమకూరినట్లు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ తెలిపారు. కట్టుదిట్టమైన భద్రత, సీసీ కెమెరాల నిఘా మధ్య గురువారం హుండీ లెక్కింపు కొనసాగింది. కరీంనగర్ ఏసీ కార్యాలయం పరిశీలకులు సత్యనారాయణ, ఏఈవో హరికిషన్, జయకుమారి, బి.శ్రీనివాస్, ప్రతాప నవీన్, ఆలయ ఉద్యోగులతోపాటు రాజరాజేశ్వర సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

తానా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్



కరీంనగర్‌టౌన్: తెలంగాణ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ (తానా) 2024–25 సంవత్సరానికి జరిగిన కార్యవర్గ ఎన్నికల్లో తెలంగాణ జోన్-2 నుంచి ఉపాధ్యక్షుడిగా నగరంలోని డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ... కొత్త జిల్లాల్లో తానా నూతన బ్రాంచ్‌లను ఏర్పాటు చేయడానికి తన వంతు కృషి చేస్తానని అలాగే ప్రైవేట్ హాస్పిటల్స్ ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కాగా శ్రీనివాస్ ఎన్నిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

హైదరాబాద్ తరహాలో కంటి వైద్య సేవలు

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ రేకుర్తి కంటి ఆస్పత్రిలో హైదరాబాద్ తరహా వైద్య సేవలు అందిస్తున్నామని డాక్టర్ మాడేకర్ ఉదార నేత్ర వైద్యశాల చైర్మన్ లయన్ కొండ వేణుమూర్తి అన్నారు. గురువారం లయన్స్‌క్లబ్ ఆఫ్ కరీంనగర్ ఆధ్వర్యంలో రెటీనా చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన వేణుమూర్తి మాట్లాడుతూ.. ఉత్తర తెలంగాణలోనే అత్యంత ప్రాముఖ్యత కలిగిన రేకుర్తి కంటి ఆసుపత్రిలో ప్రత్యేక వైద్యులతో రెటీనా చికిత్స అందించడం జరుగుతోందన్నారు. ప్రతీ ఆరునెలలకు ఒకసారి పరీక్ష చేయించుకోవాలని అన్నారు. మధుమేహం, బీపీ ఉన్నవారి తప్పనిసరిగా కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రెటీనా చికిత్సకు విశేష స్పందన లభించినట్లు తెలిపారు.

దుబాయ్‌లో బాలపల్లి యువకుడి ఆత్మహత్య

జగిత్యాలరూరల్: జగిత్యాలరూరల్ మండలం బాలపల్లికి చెందిన బైరి రంజిత్‌కుమార్ (34) నాలుగు రోజుల క్రితం దుబాయ్‌లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఇక్కడి కుటుంబసభ్యులకు సమాచారం అందింది. దీంతో వారు తీవ్రంగా రోదిస్తున్నారు. రంజిత్‌కుమార్ మృతదేహాన్ని స్వదేశానికి రప్పించేందుకు దుబాయ్‌లో ఉన్న మిత్రులు ప్రయత్నాలు కొనసాగిస్తున్నట్లు సమాచారం. రంజిత్‌కు భార్య, కుమారుడు, కూతురు సంతానం. రంజిత్‌ది నిరుపేద కుటుంబమని, ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉనుక లారీ బోల్తా



రామగుండం: కరీంనగర్ నుంచి గోదావరిఖని వైపు ఉనుక లోడుతో వెళ్తున్న లారీ మల్యాలపల్లి సబ్‌స్టేషన్ దాటిన తర్వాత మూలమలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. సమాచారం తెలుసుకున్న రామగుండం ఎస్సై సతీశ్ ఘటనా స్థలికి చేరుకొని లారీ క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్ వేముల రాంబాబును టోల్‌ప్లాజాకు చెందిన పొక్లెయిన్ సాయంతో సిబ్బంది శ్రమించి బయటకు తీశారు. క్షతగాత్రుడికి 108 సిబ్బంది ప్రాథమిక చికిత్స అందించి గోదావరిఖని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా డ్రైవర్ రాంబాబును జగ్గయ్యపేట, చిలకల్లు గ్రామం, కృష్ణ జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై కేసు

జమ్మికుంట: ప్రజలను రెచ్చగొట్టేలా సోషల్ మీడియాలో వీడియో విడుదల చేసినందుకు హుజూరాబాద్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై గురువారం కేసు నమోదు చేసినట్లు జమ్మికుంట టౌన్ సీఐ రవి తెలిపారు. గత నెల 29న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఓ వీడియో విడుదల చేస్తూ.. అందులో 'నాడు సుభిక్షం-నేడు సంక్షోభం' అంటూ మాట్లాడారు. 30న జరిగిన ముఖ్యమంత్రి సభలో రైతుబీమా, మహాలక్ష్మి, దళిత బంధు, భరోసా, అడబిడ్డలకు తులం బంగారం, మత్స్యకారుల సమస్యలు, నేతన్నవస్త్రాల విక్రయం, మద్దతు ధర పథకాలపై ప్రజలు ప్రశ్నించాలని వీడియో విడుల చేశారు. వీడియో ప్రజలను రెచ్చగొట్టేలా, శాంతి భద్రతలకు భంగం కలిగేలా ఉందని, కౌశిక్‌రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జమ్మికుంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొలుగూరి సదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

వ్యభిచార ముఠా అరెస్ట్

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని బైపాస్‌రోడ్ దేవిశ్రీ గార్డెన్స్ సమీపంలో వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠాను పోలీసులు గురువారం రాత్రి అరెస్ట్ చేశారు. వ్యభిచారం నిర్వహిస్తున్న ఇద్దరు కోదాడకు చెందిన మహిళలతోపాటు, ఓ విటుడిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

పాపం పసిప్రాణం

- బోన్‌మ్యారోతో బాధపడుతున్న చిన్నారి
- దాతలు ఆదుకోవాలని తల్లిదండ్రుల వేడుకోలు
- హైదరాబాద్ కిమ్స్‌లో చికిత్స
- శస్త్రచికిత్సకు రూ.26లక్షలు అవసరం


సాయం అందించాలని వేడుకుంటున్న దంపతులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): బుడి..బుడి నడకలతో అల్లరిచేసే కొడుకు మంచానికే పరిమితం కావడంతో ఆ తల్లిదండ్రుల హృదయాలు తల్లడిల్లుతున్నాయి. మూడేళ్ల వయస్సులోనే ఆ చిన్నారి బోన్ మ్యారోతో బాధపడుతుండడంతో ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆర్థిక పరిస్థితి అంతంతే ఉన్న వారికి రూ.25లక్షలు ఖర్చు చేస్తేనే కొడుకు బతుకుతాడన్న వైద్యుల మాటలతో నిశ్చేష్టులయ్యారు. దాతలు స్పందించి తమ కొడుకు చికిత్సకు సాయం చేయాలని వేడుకుంటున్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లికి చెందిన అందె మాసుల సంధ్య-రాజు దంపతుల కుమారుడు జిస్మిత్(3) ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించి వైద్యం అందించినా ఆరోగ్యం కుదుట పడలేదు. వైద్యుల సూచనలతో హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు బాలుడు బోన్‌మ్యారోకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించారు. బాలుడిని అక్కడే అడ్మిట్ చేసుకొని వెంటనే 'బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్' శస్త్రచికిత్స చేయాలని సూచించారు. అందుకు రూ.26 లక్షలు ఖర్చు అవుతుందని తెలిపారు. బాలుడిని ఆస్పత్రిలోనే ఉంచిన దంపతులు చేతిలో చిల్లిగవ్వ లేక దిక్కులు చూస్తున్నారు. దాతలు స్పందించి తమ కొడుకుకు ప్రాణభిక్ష పెట్టాలని వేడుకుంటున్నారు.

87906 36095లో ఫోన్‌పే, గూగుల్ పే చేయాలని కోరుతున్నారు.

వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్ట్


నిందితుల అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ రఘుచందర్

జగిత్యాలక్రైం: జగిత్యాలతోపాటు, వివిధ ప్రాంతాల్లో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. కోరుట్లలోని అల్లమయ్య గుట్ట ప్రాంతానికి చెందిన విబూది శేఖర్, బుగ్గారం మండలం బీర్సానికి చెందిన గుమ్ముల వెంకటేశ్ కొద్దికాలంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడుతున్నారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం జగిత్యాల చిన్న కెనాల్ వద్ద పట్టణ పోలీసులు వాహనాల తనిఖీ చేపడుతుండగా.. నిందితులిద్దరూ పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని చాకచక్యంగా పట్టుకున్నారు. విబూది శేఖర్ నుంచి రూ.55,700, వెంకటేశ్ నుంచి రూ.11 వేలు, 8తులాల వెండిని స్వాధీనం చేసుకున్నారు. శేఖర్ కొద్దికాలంగా ఆలయాల్లోని హుండీలను పగులగొట్టి బంగారు ఆభరణాలు దొంగిలించి విక్రయిస్తూ జల్సాలు చేస్తున్నాడు. ఇతడిపై ఇప్పటికే 10 కేసులు ఉన్నాయి. గతంలో జైలుకు కూడా వెళ్లివచ్చాడు. సమావేశంలో పట్టణ సీఐ వేణుగోపాల్, ఎస్సైలు నరేశ్, మన్మథరావు, ఏఎస్సై వేణురావు, కానిస్టేబుళ్లు జీవన్, విశాల్ పాల్గొన్నారు.

వేధింపుల కొడుకుల నుంచి ఊరట


రాములు కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ చేస్తున్న సీనియర్ సిటిజన్లు

సిరిసిల్లకల్చరల్: కొడుకులు వేధిస్తుండడంతో సీనియర్ సిటిజన్ల సంఘం వారి నుంచి ఊరట కల్పించింది. తనను వేధిస్తున్న కొడుకు నుంచి రక్షణ కల్పించాలని అభ్యర్థించిన రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సుందరయ్యనగర్‌కు చెందిన పిట్ల రాములుకు సంఘం పెద్దలు బాసటగా నిలిచారు. సంఘం బాధ్యులు చేపూరి బుచ్చయ్య, జనపాల శంకరయ్య, శ్రీగాధ మైసయ్య, దొంతుల దేవదాస్, కోడం నారాయణ, గౌరిశెట్టి ఆనందం తదితరులు గురువారం కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. రాములు జీవించి ఉన్నంతకాలం అతని పోషణ బాధ్యతలు కొడుకులు, కోడళ్లే చూసుకోవాలని తీర్మానించారు. మరోసారి వేధింపులకు గురిచేస్తే రాములు కష్టార్జితమైన ఇంటిని ఖాళీ చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. వృద్ధాప్యంతోపాటు అనారోగ్యంతో ఉన్న రాములును సరిగా చూసుకోవాలని కొడుకులు, కోడళ్లు దేవదాస్, శాలిని, కిరణ్, లావణ్యలకు హితబోధ చేశారు.

ఫ్యాషన్

కలర్‌ఫుల్‌గా.. కంఫర్ట్‌బుల్‌గా..

వేసవి వేడిమిని తట్టుకోవాలి,
కంఫర్ట్‌గా ఉండాలి
అదే టైమ్‌లో స్టైలిష్‌గానూ కనిపించాలి.
కాటన్ కుర్తీ పైకి బాందినీ,
చందేరీ, ఇకత్, సిల్క్ ఓవర్ కోట్లు
ఇప్పుడు బెస్ట్ ఛాయిస్‌గా ఉంటున్నాయి.
బోహోస్టైల్‌ని తలపిస్తూ, సమ్మర్ స్పెషల్‌గా ఉండే
ఈ స్టైల్ ఏ సందర్భానికైనా బాగా నప్పుతుంది.



సంప్రదాయ వేడుకల్లో షిమ్మరీ లుక్ ఉండే లాంగ్ ఫ్రాక్స్, వాటి మీదకు సిల్క్ డిజైనర్ లాంగ్ ఓవర్ కోట్స్ ప్రత్యేకతను చూపుతాయి.



లాంగ్ ఫ్రాక్ లేదా లాంగ్ కుర్తీ ఈ స్టైల్‌కి ఎంచుకోవచ్చు. సాక ర్యాన్ని బట్టి స్లీవ్స్ లేదా స్లీవ్‌లెస్ టాప్స్‌ని సెలక్ట్ చేసుకోవాలి. కాటన్ కుర్తీ ఏ ఫ్యాబ్రిక్ అయినా ఫ్లోరల్స్‌లో లేదా భిన్నమైన ప్రింట్లు ఉన్న ఓవర్ కోట్స్ బాగా నప్పుతాయి. ఈ స్టైల్ డ్రెస్సింగ్ బోహో లుక్‌తో అట్రాక్ట్ చేస్తుంది. ఈ కాలానికి తగినట్టుగా ఫ్యాషన్ జ్యువెలరీ దీనికి సరైన ఎంపిక అవుతుంది.



ప్లెయిన్ డ్రెస్ ధరించినప్పుడు పూర్తి కాంట్రాస్ట్ ఓవర్ కోట్ వేసుకుంటే ఎక్కడ ఉన్నా స్పెషల్‌గా కనిపిస్తారు.

కాటన్ కుర్తీ–పైజామా మీదకు ఫ్లోరల్ ప్రింట్ ఉన్న కాటన్ ఓవర్‌కోట్‌ను ధరించవచ్చు. దుపట్టా అవసరం లేని ఈ స్టైల్ క్యాజువల్ వేర్‌గానూ, పార్టీవేర్‌గానూ సెట్ అవుతుంది.



లాంగ్ ఫ్రాక్‌కి అటాచ్ చేసినట్టుగా ఉండే ఫ్రాక్ స్టైల్ ఓవర్ కోట్ పార్టీలో స్టైలిష్ లుక్‌తో వెలిగిపోతుంది.



కాటన్ లాంగ్ కుర్తీకి ఇక్కత్ లాంగ్ ఓవర్ కోట్ ధరిస్తే ఉక్కబోతను, స్టైల్‌ని రెండింటినీ బ్యాలెన్స్ చేయవచ్చు.



సింపుల్ అండ్ గ్రేస్‌గా కనిపించే లుక్ టాప్ అండ్ బాటమ్‌కి ఫ్లోరల్ ఓవర్ లాంగ్ కోట్ సూపర్ స్టైలిష్ లుక్‌గా కనిపిస్తుంది.



సిల్క్ టాప్స్ అయినా ఈవెనింగ్ టైమ్‌కి ఓకే అనుకున్నవారు అదే కాంబినేషన్‌లో వచ్చే సిల్క్ ఓవర్ కోట్ ప్రత్యేకంగా కనిపిస్తుంది.



ఓవర్‌కోట్‌లా అనిపించే లాంగ్ ఫ్రాక్ డ్రెస్‌ను కూడా ఈ స్టైల్‌కి ఎంపిక చేసుకోవచ్చు. సమ్మర్‌లో ఈవెనింగ్ పార్టీకి స్పెషల్ అట్రాక్షన్‌గా వెలిగిపోవచ్చు.

ఎక్స్‌పర్ట్

డీప్‌ఫేక్ గుట్టు ఆమెకు తెలుసు

ఇప్పుడు డీప్‌ఫేక్‌ల వివాదం నడుస్తోంది.
ఎన్నికల సమయంలోనే కాదు
సర్వ కాలాల్లోనూ డీప్‌ఫేక్ వీడియోలు
ప్రముఖులకు పెద్ద సవాలు.
ఇక స్త్రీలకు ఇవి పీడగా పరిణమించాయి.
వీటి గుట్టుమట్లు ఏమిటో
ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ నీడలో
ఎలా జాగ్రత్తగా జీవించాలో తెలియచేస్తోంది
ఆ రంగంలో నిపుణురాలు మధుమితా ముర్గియా.



మధుమితా ముర్గియా

‘ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సహాయంతో తయారయ్యే డీప్‌ఫేక్ వీడియోలు ఎంత కచ్చితంగా ఉంటాయంటే నిజమైనవా, అబద్ధమైనవా కనిపెట్టడం బ్రహ్మతరం కూడా కాదు. డీప్‌ఫేక్ వీడియోలు ఎవరినీ వదలవు. ప్రముఖులు వీటివల్ల అభాసుపాలు కావచ్చు. కాని మామూలు స్త్రీలు దీని బాధితులవుతారు. డీప్‌ఫేక్‌లో వీడియోను మార్ఫింగ్ చేయొచ్చు. అంటే మీరు పార్క్‌లో నడుస్తుంటే బీచ్‌లో నడుస్తున్నట్టుగా మార్చవచ్చు. దుస్తులతో ఉంటే దుస్తులు లేకుండా చేయొచ్చు. మరో పద్ధతి ‘ఇమేజ్ క్రియేటింగ్’. అంటే మీ వీడియో ఏమీ లేకపోయినా మీ ఇమేజ్‌ను పూర్తిగా సృష్టించి దానిని కావల్సినట్టుగా ఆడించవచ్చు. డీప్‌ఫేక్‌లో ఏ స్త్రీనైనా పోర్నోగ్రఫీ వీడియోలో ఉన్నట్టుగా భ్రమింపచేయవచ్చు. అదొక్కటే కాదు నిషేధిత సమయాల్లో నిషేధిత ప్రదేశాల్లో సంఘవ్యతిరేక శక్తుల మధ్య ఉన్నట్టుగా కూడా మిమ్మల్ని చూపొచ్చు. దీనికి అంతం లేదు. రాజకీయ ఉపన్యాసాలను డీప్‌ఫేక్‌తో మార్చి ఇబ్బంది పెట్టడం చాలా సులువు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వల్ల ప్రయోజనాలు ఎన్ని ఉన్నాయో ప్రమాదాలు అన్ని ఉన్నాయి. ఈ టెక్నాలజీ నాశనం అయ్యేది కాదు. మరింత పెరిగేది. దీని పట్ల ఎరుకతో ఉండటమే చేయగలిగింది’ అంటుంది మధుమితా ముర్గియా. ఆమె ఏ.ఐ. ఎక్స్‌పర్ట్.

బ్రిటిష్ ఇండియన్

ముంబైలో మూలాలు కలిగిన మధుమితా ముర్గియా లండన్‌లో పెరిగింది. అక్కడే చదువుకుంది. బయోలజిస్ట్‌గా, ఇమ్యునాలజిస్ట్‌గా పని చేస్తూ టెక్ ఇండస్ట్రీ గురించి ఆసక్తి పెంచుకుంది. లండన్‌కు చెందిన ఫైనాన్షియల్ టైమ్స్ పత్రికకు ఏ.ఐ. ఎడిటర్‌గా పని చేస్తూ వ్యాపార ప్రయోజనాల కోసం మన డేటా ఎలా వాడబడుతున్నదో, చేతిలోని ఫోన్ వల్ల మన ప్రైవసీకి ఎలా భంగం కలుగుతున్నదో ఆమె ప్రపంచానికి తెలియచేస్తూ వస్తోంది. అంతేకాదు ఈ విషయాల గురించి ఆమె రాసిన తాజా పుస్తకం ‘కోడ్ డిపెండెంట్’కు మంచి ప్రశంసలు వస్తున్నాయి. 2024 సంవత్సరానికి ఆమె బెస్ట్ సైన్స్ అండ్ టెక్నాలజీ జర్నలిస్ట్‌గా బ్రిటిష్ ప్రెస్ అవార్డ్‌ను గెలుచుకుంది.

ఏ.ఐ.తో మంచి: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో మూడు రంగాల్లో మంచి జరుగుతున్నదని అంటుంది మధుమిత. ‘ఆరోగ్య రంగంలో రిపోర్ట్‌ల ఆధారంగా పేషెంట్ వ్యాధిని ఏ.ఐ.తో గొప్ప స్పెషలిస్ట్ స్థాయిలో అంచనా కట్టొచ్చు. దీనివల్ల డాక్టర్ అపాయింట్‌మెంట్ కోసం వేచి ఉండే బాధ తప్పింది. ఫార్మాసూటికల్ రంగంలో కూడా ఏ.ఐ సేవలు బాగా ఉపయోగపడతాయి. ఇక సైన్స్ రంగంలో చేయాల్సిన పరిశోధనలు సులువవుతాయి. విద్యా రంగంలో విద్యార్థుల రీసెర్చ్ కోసం ఏ.ఐ. ఉపయోగపడుతుంది. నేర పరిశోధనలో ఏ.ఐ.ని వాడి నేరస్తులను పట్టుకుంటున్నారు. ఇవన్నీ మంచి విషయాలే’ అంటుందామె.

చెడు ఎంతో ఉంది:

‘ఏ.ఐ. వల్ల రాబోయే ఐదేళ్లలో ఫొటోగ్రాఫర్లు అనేవాళ్లే లేకుండా పోవచ్చు. ఏ.ఐ. సహాయంతో ఎవరైనా సరే గొప్ప ఫొటోలు తీయవచ్చు. రచయితల బదులు ఏ.ఐ.తో కథలు రాయవచ్చు. కంప్యూటర్ల మీద జరగాల్సిన చాలా పనులు మనుషులు లేకుండానే జరిగే స్థితి రావచ్చు. దీనివల్ల లాభాలు సంస్థలకు వచ్చిన మనుషుల ఉనికి అంటే ఉద్యోగుల ఉనికి ఆందోళనలో పడుతుంది. చేతిలో ఫోన్ ఉంటే ఏ.ఐ. ద్వారా మీ ప్రతి కదలికను గుర్తించవచ్చు. మీరు ఇంట్లో ఉన్నా సురక్షితం కాదు. మీరు యాప్స్ ద్వారా కొనే వస్తువులను, మీరు వెళ్లే ఆస్పత్రులను, మీరు కొనే మందులను, వెళ్లే రెస్టరెంట్లను బట్టి రాబోయే కాలంలో మీ జీవితం ఎలా ఉంటుందో ఊహించి మీ చేత ఏమేమి కొనిపించాలో మిమ్మల్ని ఎలా వినియోగదారునిగా మార్చాలో ఏ.ఐ. ఆయా కంపెనీలకు చెబుతుంది. గతంలో ఒక టెక్నాలజీని అనేక ఏళ్లు పరీక్షించి జనానికి మేలు కలిగే విధంగా వదిలేవారు. ఏ.ఐ. లాంటివి మంచి చెడ్డలు పరీక్షించకనే వదిలారు. అవి రోజు రోజుకూ శక్తి పుంజుకుంటున్నాయి. ఏ.ఐ. నుంచి తప్పించుకోలేము. అలాగని మరీ అంత భయం కూడా అక్కర్లేదు. మానవశక్తి, మానవ జ్ఞానం కృత్రిమ యాంత్రిక జ్ఞానం కంటే ఎప్పుడూ గొప్పవే’ అంటోంది మధుమిత.

వంటిల్లు

చల్ల కూరలు

మే నెల వచ్చేసింది... ఎండలు మండుతున్నాయి.
భోజనం చేయాలంటే చెమటలు పడుతున్నాయి.
కూరలను చూస్తేనే ఆకలి పోయి దాహం వేస్తోంది.
నేరుగా మజ్జిగలోకి వెళ్లాలనిపించేంత దాహం అది.
అందుకే పెరుగుతోనే కూరలు చేసుకుందాం.
ఇవన్నీ నాలుకకు హితవుగా ఉంటాయి.
తిన్న తర్వాత పొట్టను చల్లగా ఉంచుతాయి.



దహీ బైంగాన్

కావలసినవి: వంకాయ – 1 (మీడియం సైజు); నూనె – టేబుల్ స్పూన్ (వంటకు ఉపయోగించే నూనె ఏదైనా) ; ఆవనూనె – టేబుల్ స్పూన్ (పోపు కోసం) ; యాలకులు – 2 ; లవంగాలు – 2 ; పెరుగు – పావు లీటరు (చిలకాలి).
గ్రేవీ కోసం: మెంతిపిండి – టేబుల్ స్పూన్ ;అల్లం పేస్ట్ – టేబుల్ స్పూన్ ; కశ్మీర్ మిర్చిపొడర్ – టేబుల్ స్పూన్ ; నీరు – కప్పు (పై వన్నీ కలపడానికి) ; ఇంగువ– చిటికెడు ; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి ; పసుపు – టీ స్పూన్.
తయారీ: ● ఒక పాత్రలో కప్పు నీరు పోసి అందులో మెంతిపిండి, మిర్చిపొడర్, అల్లం పేస్టు వేసి కలపాలి ● వంకాయను మందపాటి చక్రాల్లా తరిగి ఉప్పు రాయాలి ● నూనె వేడి చేసి వంకాయ ముక్కలను వేయించి పక్కన పెట్టాలి(ఎయిర్ ఫ్రయర్ ఉంటే నూనె లేకుండా ఫ్రై చేసుకోవచ్చు) ● అదే బాణలిలో మిగిలిన నూనెలో ఆవ నూనె వేసి వేడెక్కిన తర్వాత లవంగాలు, యాలకులు, ఇంగువ వేయాలి. ఇందులో మెంతిపిండి, అల్లం, మిరప్పొడి కలిపిన మిశ్రమం, పసుపు వేసి కలిపి సన్న మంట మీద మరిగించాలి ● ఆ మిశ్రమం వేడెక్కిన తర్వాత పెరుగు వేసి గరిటెతో కలుపుతూ ఐదారు నిమిషాల పాటు మరిగించాలి. మిశ్రమం మరగడం మొదలైన తర్వాత మరో కప్పు నీటిని పోసి కలిపితే చిక్కటి గ్రేవీ తయారవుతుంది. ఇప్పుడు ఉప్పు కలిపి గ్రేవీ చిక్కదనాన్ని సరిచూసుకుని అవసరమైతే మరికొన్ని నీటిని పోసి మరగనివ్వాలి. ఇప్పుడు వేయించి పక్కన పెట్టుకున్న వంకాయ ముక్కలను వేసి కలిపి వడ్డించాలి. ఇది అన్నంలోకి రోటీకి కూడా మంచి కాంబినేషన్.



పులిస్సేరి

కావలసినవి: పెరుగు – పావు లీటరు ; పసుపు – పావు టీ స్పూన్ ; నీరు – పావు లీటరు.
కొబ్బరి పేస్టు కోసం: పచ్చి కొబ్బరి తురుము – అర కప్పు ; పచ్చిమిర్చి– 3 ; జీలకర్ర– టీ స్పూన్; నీరు – కప్పు లేదా కొబ్బరి పేస్టు చేయడానికి తగినంత.
పోపు కోసం: నూనె – 2 టేబుల్ స్పూన్‌లు (వంటకు ఉపయోగించే కొబ్బరి నూనె లేదా ఇతర వంట నూనె) ; ఆవాలు – అర టీ స్పూన్ ; కరివేపాకు – 2 రెమ్మలు ; మెంతులు– పావు టీ స్పూన్ ; ఎండుమిర్చి– 2 ; ఉల్లిపాయ ముక్కలు– పావు కప్పు ; అల్లం – అర అంగుళం ముక్క (సన్నగా తరగాలి) ; కొత్తిమీర తరుగు – టేబుల్ స్పూన్.
తయారీ: ● కొబ్బరి తురుము, పచ్చిమిర్చి, జీలకర్ర మిక్సీలో గ్రైండ్ చేయాలి. తగినంత నీటిని వేస్తూ మెత్తగా చేసుకోవాలి ● ఒక పాత్రలో పెరుగు, పసుపు, నీరు కలిపి చిలికి అందులో ఉప్పు, కొబ్బరి పేస్టు వేసి కలపాలి ● ఈ పాత్రను స్టవ్ మీద పెట్టి మీడియం మంటమీద మధ్యలో గరిటెతో కలుపుతూ వేడిచేయాలి. దీనిని ఎక్కువసేపు ఉడికించాల్సిన అవసరం లేదు. మరగడం మొదలైన వెంటనే దించేయాలి ● బాణలిలో నూనె వేడిచేసి ఆవాలు వేయాలి. అవి వేగిన తర్వాత మెంతులు, ఎండుమిర్చి, కరివేపాకు, ఉల్లిపాయ ముక్కలు, అల్లం తరుగు వేసి చిన్న మంట మీద మగ్గనివ్వాలి. ఉల్లిపాయ ముక్కలు ఎర్రగా వేగిన తర్వాత పోపును ముందుగా వేడి చేసి సిద్ధంగా ఉంచిన పెరుగు– కొబ్బరి పేస్టు మిశ్రమంలో కలిపి, కొత్తిమీర చల్లి మూత పెట్టాలి. ఈ కేరళ వంట అన్నంలోకి రుచిగా ఉంటుంది.



కుకురార్

కావలసినవి: చికెన్ – అర కేజీ ; చిక్కటి పెరుగు – 5 టేబుల్ స్పూన్‌లు ; బంగాళ దుంప – 2 (ముక్కలుగా తరగాలి) ; అల్లం వెల్లుల్లి తరుగు – 2 టేబుల్ స్పూన్‌లు ; ఉల్లిపాయలు – 3 (తరగాలి) ; ఆవ నూనె లేదా సాధారణ వంటనూనె – 5 టేబుల్ స్పూన్‌లు ; చక్కెర – చిటికెడు ; ఉప్పు – 2 టీ స్పూన్‌లు లేదా రుచిని బట్టి ; ఎండు మిర్చి– 5 ; పచ్చిమిర్చి– 3 (నిలువుగా చీరాలి) ; పసుపు – టీ స్పూన్ ; మిరప్పొడి– 2 టీ స్పూన్‌లు ; గరం మసాలా పొడి – టీ స్పూన్ ; చికెన్ మసాలా పొడి– టీ స్పూన్ ; కొత్తిమీర తరుగు – టేబుల్ స్పూన్.
తయారీ: ● చికెన్‌ను శుభ్రంగా కడిగి ఒక పాత్రలో వేయాలి. అందులో పసుపు, చికెన్ మసాలా పొడి, మిరప్పొడి వేసి మసాలా పొడులు చికెన్ ముక్కలకు బాగా పట్టేటట్లు కలిపి 20 నిమిషాల పాటు పక్కన ఉంచాలి ● ఈ లోపు ఒక బాణలిలో నూనె వేడి చేసి అందులో ఇంగువ, చక్కెర, ఎండు మిర్చి, ఉల్లిపాయ ముక్కలు వేసి దోరగా వేయించి ఒక ప్లేట్‌లోకి తీసుకోవాలి. ఇవి చల్లారిన తరవాత మిక్సీలో గ్రైండ్ చేయాలి. అందులోనే పెరుగు కూడా వేసి సమంగా కలిసేటట్లు ఒకసారి తిప్పి ఒక పాత్రలోకి తీసుకుని పక్కన పెట్టాలి ● ఉల్లిపాయలు వేయించిన బాణలిలో మిగిలిన నూనెలో బంగాళా దుంప ముక్కలు వేయించి ఒక పాత్రలోకి తీసుకుని పక్కన ఉంచాలి. అదే బాణలిలో అల్లం, వెల్లుల్లి, పచ్చిమిర్చి వేయించి తీసి పెట్టుకోవాలి ● ఇప్పుడు మిగిలిన నూనెలో మారినేట్ చేసిన చికెన్ ముక్కలు వేసి మీడియం మంట మీద వేయించాలి. చికెన్ ముక్కలు ఎర్రగా వచ్చేవరకు వేయించి అప్పుడు ఉప్పు వేసి ముక్కలకు పట్టేటట్లు కలపాలి. చికెన్ ముక్కల నుంచి నూనె వేరవుతున్న సమయంలో బంగాళాదుంప ముక్కలను వేయాలి. ఈ రెండింటినీ కలిపి పది నిమిషాల పాటు వేయించిన తర్వాత అందులో రెండు కప్పుల నీరు పోసి కలిపి మంట పెంచి ఉడకనివ్వాలి ● చికెన్ ఉడికేటప్పుడు అందులో ముందుగా వేయించి పెట్టుకున్న అల్లం, వెల్లుల్లి, పచ్చిమిర్చి తోపాటు గరం మసాలా పొడి, చిలికిన పెరుగు మిశ్రమాన్ని వేయాలి. ఇవన్నీ కలిసి ఉడికిన తర్వాత చివరగా కొత్తిమీర వేసి కలిపి దించేయాలి. ఈ కుకురార్ అస్సాం వాళ్ల వంట. అన్నం, రోటీల్లోకి రుచిగా ఉంటుంది.



గుజరాతీ కడీ

కావలసినవి: శనగపిండి– 4 టేబుల్ స్పూన్‌లు; అల్లం పచ్చిమిర్చి పేస్ట్– అర టేబుల్ స్పూన్ (అల్లం అంగుళం ముక్క, రెండు పచ్చిమిర్చి కలిపి గ్రైండ్ చేయాలి); తాజా పెరుగు – కప్పు ; బెల్లం లేదా చక్కెర – టేబుల్ స్పూన్ ; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి ; నీరు – రెండున్నర కప్పులు.
పోపు కోసం: నూనె – టీ స్పూన్ ; ఆవాలు – అర టీ స్పూన్ ; జీలకర్ర– అర టీ స్పూన్ ; దాల్చిన చెక్క – అంగుళం ముక్క ; లవంగాలు – 2 ; కరివేపాకు – ఒక రెమ్మ ; ఎండు మిర్చి – 2; మెంతులు – పావు టీ స్పూన్ ; ఇంగువ – చిటికెడు ; కొత్తిమీర తరుగు – టేబుల్ స్పూన్.
తయారీ: ● ఒక పాత్రలో శనగపిండి, అల్లం–పచ్చిమిర్చి పేస్ట్, పెరుగు, బెల్లం, ఉప్పు వేసి బాగా చిలకాలి ● బాణలిలో నూనె వేడిచేసి ఆవాలు వేయాలి. అవి పేలిన తర్వాత జీలకర్ర, దాల్చిన చెక్క, లవంగాలు, కరివేపాకు, ఎండు మిర్చి (విరిచి వేయాలి), మెంతులు, ఇంగువ వేసి దోరగా వేగిన తర్వాత స్టవ్ ఆపేయాలి. ఈ పోపును ముందుగా చిలికి పెట్టుకున్న పెరుగు – శనగపిండి మిశ్రమంలో వేసి కలపాలి ● ఇప్పుడు ఆ పాత్రను మీడియం మంట మీద ఉంచి మిశ్రమం అడుగుకు అంటుకోకుండా గరిటెతో కలుపుతూ ఉడికించాలి. మిశ్రమం మరగడం మొదలైన తర్వాత మంట తగ్గించి కలుపుతూ మాడకుండా చూసుకోవాలి. శనగపిండి పచ్చి వాసన పోయిన తర్వాత మిశ్రమం మంచి రుచికరమైన వాసన వస్తుంటుంది. అప్పుడు కొత్తిమీర చల్లి దించేయాలి ● గుజరాతీ కడీని సూప్‌లాగ భోజనానికి ముందు తాగవచ్చు. అన్నంలో కలుపుకోవచ్చు, రోటీలోకి కూడా తినవచ్చు. ఇది వేసవి, శీతాకాలాల్లో కూడా ఆరోగ్యకరమైన ఆహారం.